## అయోధ్యకు సైకిల్ సవారి



యాత్రికులకు పండ్లు అందజేస్తున్న పిట్లం వాసులు

పిట్లం, డిసెంబర్ 26: కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాకు చెందిన 11 మంది యువకులు సైకిళ్లపై అయోధ్యకు బయల్దేరారు. వారి ర్యాలీ పిట్లం గ్రామానికి మంగళవారం చేరుకున్నది. పిట్లం గ్రామానికి చెందిన యువకులు బొమ్మల దేవేందర్, దేమె అరవింద్ వారికి పండ్లు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. 21 రోజుల పాటు సైకిల్ యాత్ర చేపట్టి అయోధ్యకు చేరుకుంటామని యాత్రికులు అజయ్‌శర్మ, విజయ్‌శర్మ, ఉదయ్‌శర్మ, సాయినాథ్, భువనేశ్, ఆమేశ్, జగదీశ్, విష్ణు, అభిషేక్, హన్మంతు తెలిపారు.

## పరిశ్రమల ఏర్పాటు, రుణాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డీడీ రాజేశ్‌కుమార్ యాదవ్

ఖలీల్‌వాడి, డిసెంబర్ 26: నగరంలోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల కేంద్ర మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఎస్టీ యువతకు పరిశ్రమల ఏర్పాటుపై మంగళవారం అవగాహన కల్పించారు. ఎంఎస్ఎంఈ, డీఎఫ్‌వో హైదరాబాద్ డీడీ రాజేశ్‌కుమార్ యాదవ్ హాజరై శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం, ముడిసరుకుల సరఫరా, మార్కెటింగ్ కోసం సహకారం అందిస్తామన్నారు. కుల వృత్తుల వారికి ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద రూ. లక్ష వరకు గ్యారంటీ లేని రుణాలు పంపిణీ చేస్తామన్నారు.

## కమ్మేసిన పొగమంచు

చలితో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు

వాహనదారులకు తప్పని ఇబ్బందులు..

ఒకవైపు రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో చలి తీవ్రత పెరుగుతున్నది. దీనికి తోడు పొగమంచు కమ్మేస్తుండడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం తొమ్మిది గంటల వరకు సైతం భానుడి జాడ కనిపించకపోవడంతో రోడ్లపై వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. వాహనాలకు లైట్లు వేసుకొని వెళ్లినా ఎదుటివారు కనిపించే పరిస్థితి లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు



నిజామాబాద్ నగరంపై మంచు దుప్పటి...



నవీపేట్: పొగమంచులో కనిపించని భానోదయం

# ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా ఆరు గ్యారెంటీలు

'ప్రజాపాలన' నిర్వహణ ప్రణాళిక రూపొందించాలి

అధికారులు జవాబుదారీతనంతో పని చేయాలి

ఉమ్మడి జిల్లా అధికారుల సమీక్షలో మంత్రి జూపల్లి కృష్ణారావు



ప్రజా పాలన ప్రణాళిక కాపీలను విడుదల చేస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు

ఖలీల్‌వాడీ, డిసెంబర్ 26 : ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలనే ఉద్దేశంతో రాష్ట్రప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలు కోసం 'ప్రజాపాలన' అనే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణను ఈనెల 28 నుంచి జనవరి 6 వరకు చేపట్టనుండడంతో నిజామాబాద్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో మంగళవారం నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మ ంత్రి అధికారులకు మార్గనిర్దేశం చేశారు. దశాబ్దాల పాటు పోరాటం చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఎంతోమంది తమ సమస్యలు పరిష్కారమవుతాయని, కష్టాలు తొలగిపోతాయని ఎంతో ఆశతో ఉన్నారన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వారి సమస్యలను తీర్చి బడుగు, బలహీన వర్గాల ఆర్థిక ప్రగతికి తోడ్పాటునందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని రూపొందించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించాలని నిర్ణయించిందన్నారు. అధికారులు జవాబుదారీతనంతో పారదర్శకంగా క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని హితవు పలికారు. ప్రజలన నుంచి వచ్చే దరఖాస్తులను స్వీకరించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి పేదవాడికీ తప్పనిసరిగా న్యాయం జరగాలనే ప్రభుత్వ సంకల్పం నెరవేరేలా అధికారులు అంకితభావంతో పని చేయాలన్నారు. ప్రజాపాలన కార్యక్రమంపై విస్తృత ప్రచారం నిర్వహిస్తూ ప్రజలందరికీ అవగాహన కల్పించాలన్నారు. ఈ ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి అవగాహన కల్పించేలా ప్రజాప్రతినిధులు, మీడియా, సోషల్ మీడియాలో యువత కూడా తమ వంతు చొరవ చూపాలన్నారు. క్షేత్రస్థాయిలో సంపూర్ణ సమాచారాన్ని సేకరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని, తద్వారా అర్హులకు సంక్షేమ ఫలాలు అందుతాయని మంత్రి జూపల్లి ఆశాభావం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలు, యువత ఇలా అన్ని వర్గాల వారికి మేలు చేకూర్చడమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ప్రజాపాలనలో తొక్కిసలాటలు, రద్దీ వంటి వాటికి ఆస్కారం లేకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ ముందస్తుగానే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలీసు శాఖ కూడా సంపూర్ణ భాగస్వామ్యం అయి, ప్రజాపాలన అమలు కోసం పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీలు కేఆర్ సురేశ్‌రెడ్డి, అర్వింద్, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నగర మేయర్ నీతూ కిరణ్, ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ , వెంకటరమణారెడ్డి , కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, పి.యాదిరెడ్డి, మనూ చౌదరి, మున్సిపల్ కమిషనర్ మకరంద్, ఉభయ జిల్లాలకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### అక్రమ మైనింగ్‌ను సహించం

మంత్రి జూపల్లి ఆగ్రహం

సమగ్ర నివేదికకు ఆదేశం

ఖలీల్‌వాడి, డిసెంబర్ 26: అనుమతి లేకుండా, ప్రజలకు నష్టం కలిగించేలా కొనసాగుతున్న అక్రమ మైనింగ్‌ని ఏ మాత్రం ఉపేక్షించేది లేదని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు హెచ్చరించారు. సమీక్ష కోసం నిజామాబాద్‌కు వస్తున్న సందర్భంలో కామారెడ్డిలో పలువురు బాధితులు మాచారెడ్డి ఉమ్మడి మండలాలకు చెందిన అక్రమ మైనింగ్‌పై ఫిర్యాదు చేసినట్లు మంత్రి తెలిపారు. భారీ పేలుళ్లతో వందలాంది బోరుబావులు, నివాసాలు దెబ్బతిన్నాయని బాధితులు ఆవేదన వ్యక్తంచేశారని అన్నారు. కొన్నేండ్లుగా అక్రమ మైనింగ్ బ్లాస్టింగ్ జరుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోలేదని సంబంధిత అధికారులను ఆరా తీశారు. తక్షణమే విచారణ చేపట్టి వారం రోజుల్లో సమగ్ర నివేదికను సమర్పించాలని ఆదేశించారు.

అక్రమ మైనింగ్‌తో నష్టపోయిన బాధితులకు మైనింగ్ యాజయాన్యం ద్వారా పరిహారం ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



నిజాంసాగర్ మండలం వొడ్డేపల్లి దత్తాశ్రమం వద్ద భక్తుల సందడి

## ఘనంగా దత్తజయంతి

కొనసాగిన ప్రత్యేక పూజలు

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

కొనసాగిన అన్నదాన కార్యక్రమాలు



బాన్సువాడ అయ్యప్ప ఆలయంలో ఎమ్మెల్యే పోచారం పూజలు

**ఉమ్మడి జిల్లాలో** దత్త జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు కొనసాగాయి. ఆలయాలకు భక్తులకు పోటెత్తారు. పంచామృత అభిషేకాలు, గణపతి హోమం, గురు చరిత్ర పారాయణం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. బాన్సువాడ పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన దత్త జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు

## కారును ఢీకొట్టిన కంటైనర్ వాహనం

నలుగురికి తీవ్రగాయాలు



ఘటనా స్థలంలో ధ్వంసమైన కారు

ఇందల్వాయి, డిసెంబర్ 26 : ఇందల్వాయి టోల్ ప్లాజా వద్ద ఆగి ఉన్న కారును వెనుక నుంచి ఓ కంటైనర్ వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో కారుతోపాటు టోల్ ప్లాజా కౌంటర్ సైతం ధ్వంసమయ్యాయి. సీఐ కృష్ణ, ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి నుంచి వస్తున్న కారు టోల్‌టాక్స్ చెల్లిస్తుండగా మద్యం మత్తులో ఉన్న డ్రైవర్.. కంటైనర్ వాహనంతో వేగంగా వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరితో పాటు టోల్‌ప్లాజా సిబ్బంది మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో జిల్లా దవాఖానకు తరలించారు. ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించి లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ కృష్ణ తెలిపారు.

## అర్బన్ పార్క్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే



అధికారులతో మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి

మాక్లూర్, డిసెంబర్ 26: మండలంలోని చిన్నాపూర్, మామిడిపల్లి గ్రామాల శివారులో ఉన్న అర్బన్‌పార్కును ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. పార్కులోని వసతులను చూసి సంతృప్తి వ్యక్తంచేశారు. త్వరలోనే మంచిరోజు చూసి పార్కును ప్రారంభిద్దామని ఫారెస్ట్ డివిజనల్ అధికారి భవానీశంకర్‌కు సూచించారు. పార్కులో పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. బోటింగ్, ఇతర పెండింగ్ పనుల కోసం నిధులు అవసరమైతే మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్, డీఆర్‌వోలు అశోక్‌కుమార్, సుధాకర్, సౌమ్య, బీట్ అధికారులు సుశీల్, రజిత, ఎంపీవో శ్రీనివాస్, సంతోష్, వినోద్ ఉన్నారు.

## మాక్లూర్ ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం



అవిశ్వాస తీర్మాన కాపీని అదనపు కలెక్టర్ చిత్రామిశ్రాకు అందజేస్తున్న ఎంపీటీసీలు

మాక్లూర్, డిసెంబర్ 26: మాక్లూర్ మండల పరిషత్ అధ్యక్షుడు మాస్త ప్రభాకర్‌పై పలువురు ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానం చేశారు. మదన్‌పల్లి ఎంపీటీసీ గోవూరి ఒడ్డెన్న ఆధ్వర్యంలో తొమ్మిది మంది ఎంపీటీసీలు సంతకాలు చేసిన తీర్మాన పత్రాన్ని అదనపు కలెక్టర్ చిత్రామిశ్రాకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌కుమార్‌రెడ్డి, మాక్లూర్ మండల అధ్యక్షుడు రవిప్రకాశ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌లో చేరిన ఎంపీటీసీలు**

మదన్‌పల్లి ఎంపీటీసీ గోవూరి ఒడ్డెన్న, గొట్టుముక్కుల ఎంపీటీసీ బేగరి సత్తెమ్మ, డీకంపల్లి ఎంపీటీసీ కాలగడ్డ గంగామణి ఆర్మూర్ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి మంత్రి జూపల్లి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గంగాధర్‌గౌడ్, వెంకటేశ్వర్‌రావు, రవి ప్రకాశ్, దయాకర్ రావు, రాజు, పోశెట్టి పాల్గొన్నారు.

## తిమ్మాపూర్... బాల్‌బ్యాడ్మింటన్‌లో జోరు

రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్న విద్యార్థులు

పతకాల సాధనతో గ్రామానికి ప్రత్యేక గుర్తింపు

**ఒకప్పుడు బాల్‌బ్యాడ్మింటన్** అంటే మోజు ఉండేది. ఇప్పుడు ఆ క్రీడను ఆడేవారే అరుదు. అలాంటి ఆటపై మక్కువ పెంచుకొని జిల్లా,రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తున్నారు తిమ్మాపూర్ విద్యార్థులు. జిల్లా నుంచి జాతీయస్థాయి వరకు ఎక్కడ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు జరిగినా తిమ్మాపూర్ విద్యార్థులు అందులో పాల్గొంటారంటే అతిశయోక్తి కాదు. బాల్‌బ్యాడ్మింటన్‌లో రాణిస్తూ తిమ్మాపూర్ గ్రామానికే ప్రత్యేక గుర్తింపును తీసుకువస్తున్నారు విద్యార్థులు.

మోర్తాడ్, డిసెంబర్ 26



బాల్‌బ్యాడ్మింటన్ పోటీలో తిమ్మాపూర్ విద్యార్థులు

జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్‌లో తిమ్మాపూర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతున్న తిమ్మాపూర్ విద్యార్థిని ఊట్నూర్ శివాని ఇప్పటి వరకు మూడుసార్లు జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్నది. 2018-19లో కర్ణాటకలో జరిగిన జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో, 2022-23లో మహారాష్ట్రలో జరిగిన జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో, 2018-19లో నేషనల్ ఇంటర్ స్కూల్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో అండర్-17 బాలికల విభాగంలో పాల్గొని ప్రతిభ కనబరిచింది. అక్షయ అనే మరో విద్యార్థిని రెండుసార్లు జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్నది. దీక్షిత్ 2023 ఫిబ్రవరిలో మంచిర్యాలలో జరిగిన సబ్‌జూనియర్ నేషనల్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించాడు. బొమ్మెన రచన అనే విద్యార్థిని 1999-20 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌లోని నారాయణపురంలో జరిగిన జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్‌లో పాల్గొని ప్రతిభ కనబరిచింది. రుతిక ఛత్తీస్‌ఘడ్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచింది. సాయినాథ్ అనే విద్యార్థి అక్టోబర్‌లో ఛత్తీస్‌ఘడ్‌లో జరిగిన జాతీయస్థాయి బాల్ బ్యాండ్మింటన్ సబ్‌జూనియర్ పోటీల్లో పాల్గొని రజత పతకాన్ని సాధించాడు.

**జిల్లా, రాష్ట్రస్థాయిలో..**

శివాని 2018 నుంచి 2023 వరకు ఆరుసార్లు రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోట్లీ పాల్గొనగా, అక్షయ రెండుసార్లు, దీక్షిత్ రెండుసార్లు, రచన నాలుగు సార్లు, రుతిక ఒకసారి, సాయినాథ్ ఒకసారి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. జిల్లా స్థాయిలో జరిగే ప్రతి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో తిమ్మాపూర్ విద్యార్థులు పాల్గొనడం విశేషం.

**కోచ్ సహకారంతో రాణిస్తున్న విద్యార్థులు**

తిమ్మాపూర్ ఉన్నత పాఠశాల పీడీ శ్యామ్ శిక్షణ, ప్రోత్సాహంతో తిమ్మాపూర్ విద్యార్థులు బాల్‌బ్యాడ్మింటన్‌లో జాతీయస్థాయిలో రాణిస్తున్నారు. విద్యార్థులకు బాల్‌బ్యాడ్మింటన్‌లో ప్రత్యేక శిక్షణను ఇస్తుండడంతోపాటు ప్రతి వేసవికాలంలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు.

దీంతో ఇక్కడి విద్యార్థులకు ఈ ఆటపై మక్కువ పెరగడంతోపాటు మెళకువలు నేర్చుకుంటూ జిల్లా స్థాయి నుంచి జాతీయస్థాయి వరకు ఎదిగారని చెప్పవచ్చు.

### ఇష్టంగా ఆడడంతో..



బాల్‌బ్యాడ్మింటన్ ఆడడం ప్రారంభించిన నుంచి ఆటపై ఇష్టం పెరిగింది. ఇష్టంతో ఆడడం వల్లే రాణించగలుగుతున్నాం. ఆటలో చేసిన తప్పులను తెలుసుకొని, నైపుణ్యాలను మెరుగుపర్చుకొని ప్రతిభ చూపగలుగుతున్నాం. టోర్నమెంట్‌లో పాల్గొన్న ప్రతిసారీ చేసిన తప్పులను తెలుసుకుంటూ ఆ తప్పులు తిరిగి చేయకుండా ముందుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాం.

**- ఊట్నూర్ శివాని, తిమ్మాపూర్**

### ప్రతిరోజూ శిక్షణనిస్తాను



తిమ్మాపూర్ ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు ఉదయం, సాయంత్రం రోజూ బాల్‌బ్యాడ్మింటన్‌లో శిక్షణ ఇస్తాను. దీంతో విద్యార్థులు బాగా రాణిస్తున్నారు. జిల్లా స్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబరచి, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో కూడా పాల్గొంటున్నారు. విద్యార్థులకు శిక్షణను ఇవ్వడంతోపాటు టోర్నమెంట్లకు తీసుకెళ్లేందుకు సహకరిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులకు కృతజ్ఞతలు.

**- శ్యామ్, జిల్లా బ్యాడ్మింటన్ కార్యదర్శి, తిమ్మాపూర్**